

పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ హైకోర్టు కాలనీలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయ షష్టమ వార్షికోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు దీపావళి శ్రవణ్‌కుమార్, లక్ష్మారెడ్డి, వెంకటేశ్వరరావు, నాగరాజు, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

వనస్థలిపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్‌లోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జక్కిడి ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి పత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వనస్థలిపురం డివిజన్‌లోని రైతుబజార్ ముందు రోడ్డు, ఓపెన్ ఆడిటోరియం, మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణం, ఏ టైప్‌లో సెప్టిక్ స్థలాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని ఎంపీని కోరారు. తక్షణమే స్పందించిన ఎంపీ సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు అంజన్‌కుమార్‌గౌడ్, క్రాంతి, రమేష్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీశ్రీహోమ్స్‌లో ఖాళీ స్థలాలను కాపాడండి

సరూర్‌నగర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడలోని శ్రీశ్రీహోమ్స్ కాలనీలో వెంచర్ నిర్వాహకుడు ఖాళీ స్థలాలను ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నాడని, సదరు కబ్జా ప్రయత్నాలను అడ్డుకుని ఖాళీ స్థలాలను కాపాడాలని కాలనీవాసులు కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి ఆధ్వర్యంలో కాలనీ ప్రతినిధులు లక్ష్మీనర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సర్వేశ్వర్‌రావు, యాదయ్య, సుఖేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అర్జున్, శేఖర్‌రెడ్డి, వెంకటేశం, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు.

యూజీడీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

చంపాపేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): చంపాపేట చౌరస్తా నుంచి గాంధీ చౌరస్తా వరకు రూ.85లక్షలతో చేపట్టనున్న యూజీడీ నిర్మాణ పనులకు బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాశం శ్రీశైలం, సిల్వేరు అనిల్‌కుమార్, శ్రీనివాసనాయుడు, యోగిరాజ్, అంజి, కళ్యాణ్, బిహారీప్రసాద్, బస్తీవాసులు బి.రవీందర్, రాము, యాదగిరి, ఈశ్వర్, జగన్ పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన కార్పొరేటర్ సుజాతానాయక్



మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

చంపాపేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బానోతు సుజాతానాయక్ బుధవారం జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిసి డివిజన్‌లోని వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తా : కార్పొరేటర్ రాగుల

వనస్థలిపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ జైహింద్‌బాబు కాలనీలో పాదయాత్ర చేస్తూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో భాగంగా పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు సంజయ్‌కుమార్, స్వర్ణమాధవి, సాయికిరణ్‌గౌడ్, ఉప్పు వెంకటేశ్, శ్రీధర్ పాల్గొన్నారు.

వరదనీటి పైప్‌లైన్ పనులు చేపట్టాలి

వనస్థలిపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వరదనీటి పైప్‌లైన్ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని మహాలక్ష్మీనగర్, జక్కిడి రామస్వామి కాలనీ దిగువ నుంచి సౌభాగ్యనగర్ తూర్పుభాగం నుంచి బృందావన్ మెడోస్ వరకు ఇరిగేషన్ అధికారులతో కలిసి రాచకాలువను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ శృజ్ఞా, ఏఈ సతీష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

సైదాబాద్ : మలక్‌పేట బీ బ్లాక్‌లోని ప్రభుత్వ అంధ బాలికల పాఠశాలలో పదోతరగతి విద్యార్థినులకు బుధవారం ఇక్షణ ఫౌండేషన్ ప్రతినిధులు పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి, వీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మందడి వెంకట్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఖుద్సియా, జీనత్, ఉపాధ్యాయులు సద్గుణ, నవీద్ ఉన్నీసా, అఫ్రోజ్ పాల్గొన్నారు.

పోస్టల్ అండ్ టెలికాం కాలనీ అధ్యక్షుడిగా నర్సింగ్‌రావు

సరూర్‌నగర్ : బడంగ్‌పేట్ కార్పొరేషన్ గుర్రంగూడ 26వ డివిజన్‌లోని పోస్టల్ అండ్ టెలికాం ఉద్యోగుల కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షుడిగా వి.పర్వతాలుగౌడ్, ప్రధాన కార్యదర్శి గా ఎం.చంద్రయ్యగౌడ్, సంయుక్త కార్యదర్శిగా ఎస్.ఎస్.రాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా బి.శివశంకర్‌నాయక్, కోశాధికారిగా వి.మాల్యాద్రి, ఉపకోశాధికారిగా ఎల్.సంతోష్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా విష్ణువర్ధన్, దినేశ్, గోపీనాథ్‌ను ఎన్నుకున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

● కాలి బూడిదైన ట్రావెల్స్ షెడ్డు, పండ్ల బండ్లు

హయత్‌నగర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో ట్రావెల్స్ షెడ్డు, పండ్ల బండ్లు కాలి బూడిదైన సంఘటన మంగళవారం అర్ధరాత్రి హయత్‌నగర్‌లో జరిగింది. ఫైర్ సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం గోడను ఆనుకుని ఉన్న కొమురంభీం విగ్రహం వద్ద మహేష్ అనే వ్యక్తి ఒక షెడ్డును ఏర్పాటు చేసుకుని అందులో ట్రావెల్స్‌ను నడిపిస్తున్నారు. రాత్రి వేళలో స్థానికంగా ఉండే పండ్ల వ్యాపారులు తమ పండ్ల బండ్లను అక్కడే పార్కు చేస్తారు. మంగళవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌కు మంటలు అంటుకుని ట్రావెల్స్ షెడ్డు, అందులో ఉండే కంప్యూటర్, అక్కడ పార్కు చేసిన మూడు పండ్ల బండ్లు పూర్తిగా కాలిపోయాయి. దట్టమైన మంటలు చేలరేగడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి ఫోన్‌చేయడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే పండ్ల బండ్లు, ట్రావెల్స్ షెడ్డు పూర్తిగా కాలిపోయాయి. మంటలకు రేణుక ఎల్లమ్మ ఆలయం గోడలు, కొమురం భీం విగ్రహం మసిబారాయి. బాధితుల ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు, ఫైర్ సిబ్బంది కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఎల్బీనగర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం ప్రారంభమై, ప్రశాంతంగా జరిగాయి. దిల్‌సుఖ్‌నగర్, సరూర్‌నగర్, సైదాబాద్, మలక్‌పేట, హయత్‌నగర్, చంపాపేట, కొత్తపేట, వనస్థలిపురం పరిసరాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు ఉదయమే చేరుకున్నారు. ఉదయం 9గంటలకు పరీక్ష ప్రారంభం కానుండడంతో విద్యార్థులను అరగంట ముందే పరీక్ష హాల్‌లోకి అనుమతించారు. మధ్యాహ్నం 12గంటల వరకు జరిగాయి. సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 552మంది విద్యార్థులకు గాను 544మంది పరీక్ష రాయగా 8మంది గైర్హాజరయ్యారు.



పరీక్ష కేంద్రం వద్ద రూమ్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

హయత్‌నగర్ : హయత్‌నగర్ పరిధిలోని హయత్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, సామనగర్‌లోని తెలంగాణ మైనారిటీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, కుంట్లూర్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల కళాశాల, నారాయణ జూనియర్ కళాశాల పసుమాముల రోడ్డు, కుంట్లూర్ నారాయణ కళాశాల, హయత్‌నగర్ శ్రీచైతన్య జూనియర్ కళాశాల, హయత్‌నగర్ వార్డ్ అండ్ డీడ్ కళాశాల, కల్వంచ వశిష్ట జూనియర్ కళాశాల, మదర్ డెయిరీ వద్ద గల ఎక్సెల్ జూనియర్ కళాశాల, పెద్దఅంబర్‌పేట్‌లోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల, హయత్‌నగర్ జిల్లాపరిషత్ పాఠశాల సెంటర్లలో పరీక్షలు జరిగాయి.

చంపాపేట : చంపాపేట డివిజన్‌లోని యాదగిరినగర్‌లోని విద్యాదయానీ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 240మంది, ఎస్‌జీఆర్‌కాలనీలోని శ్రీ చంద్ర జూనియర్ కళాశాలలో 379 మంది, చంపాపేట చౌరస్తాలోని నారాయణ జూనియర్ కళాశాలలో 383 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

సైదాబాద్ : సైదాబాద్, మాదన్నపేట పోలీస్‌స్టేషన్ల పరిధిలోని 9 కేంద్రాలలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సైదాబాద్ పీఎస్ పరిధిలోని నారాయణ కాలేజీ చంపాపేట పరీక్షా కేంద్రంలో 364మంది విద్యార్థులకు గాను 352, శ్రీ ఆకాశ్ జూనియర్ కళాశాలలో 381మందికి గాను 352మంది, ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో 413మందికి గాను 403మంది విద్యార్థులు, రెడ్డికాలనీ గురుకుల కళాశాలలో 210 మందికి 203, సక్సెస్ జూనియర్ కాలేజీ 453కు 431మంది విద్యార్థులు హాజరయ్యారు. మాదన్నపేట పీఎస్ పరిధిలోని ప్రిన్సెస్‌దురు షేవార్ కాలేజీ పరీక్షా కేంద్రంలో 326మంది విద్యార్థులకు గాను 318, చంచల్‌గూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 214 మందికి గాను 210మంది, ఇస్లామియా జూనియర్ కళాశాలలో 521మందికి గాను 497మంది విద్యార్థులు పరీక్ష రాశారు.



ఇంటర్ పరీక్ష రాసేందుకు సరూర్‌నగర్ ప్రభుత్వ కళాశాల పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమానికి కేంద్రం చేయూత

● ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ఎల్బీనగర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం చేయూతనిస్తున్నదని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆర్టిఫీషియల్ లింబ్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో వయోవృద్ధులు, దివ్యాంగులకు ఉపకరణాలు అందజేయడానికి సరూర్‌నగర్‌లోని డీడీఆర్‌సీ కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరాన్ని బుధవారం కార్పొరేటర్లు రాధాధీరజ్‌రెడ్డి, ఆకుల శ్రీవాణిఅంజన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి జీవనాధారం లేకుండా ఉన్నటువంటి దివ్యాంగులను ఆదుకోవడం ఎంపీగా తన బాధ్యతన్నారు. కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులు, వృద్ధుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆర్టిఫీషియల్ లింబ్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో ఉపకరణాలు, వాహనాలు, ఆర్థిక సహకారం అందజేస్తుందన్నారు. అందుకోసమే ఈ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ ఏ. సుజాత, నోడల్ అధికారి రమేష్, డాక్టర్ జయశ్రీ, డాక్టర్ సుస్మిత, సజిత, శ్రీవాత్సవ్, శ్రీనివాస్, బీజేపీ నగర మాజీ కార్యదర్శి రావిరాల సంధ్యారాణి, ఆకుల అంజన్, సిద్ధుముదిరాజ్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు గోవర్ధన్, జైన్‌బాబు పాల్గొన్నారు.



వృద్ధులతో ముచ్చటిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వచ్చే ఎన్నికల్లో మహేశ్వరంలో బీజేపీదే విజయం

సరూర్‌నగర్ : వచ్చే ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని, పార్టీ కచ్చితంగా గెలిచి తీరుతుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని శివనారాయణపురం చౌరస్తాలో ఏర్పాటు చేయనున్న బీజేపీ జెండా దిమ్మె నిర్మాణానికి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్‌తో కలిసి బుధవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కొండా మాట్లాడుతూ చేవెళ్ల లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, యాదగిరి, దేవేందర్‌రెడ్డి, పార్టీ బడంగ్‌పేట్ క్లస్టర్-12 అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్లు రమాదేవిశ్రీనివాస్, లక్ష్మారెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాల నుంచి రక్షణ

● ప్రచార వీడియోలను విడుదల చేసిన సీపీ సుధీర్‌బాబు



సైబర్ నేరాలపై అవగాహన పెంచే వీడియోలను విడుదల చేస్తున్న సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అప్రమత్తత, అవగాహనతోనే సైబర్ నేరాలకు చెక్ పెట్టవచ్చని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం సైబర్ అవేర్‌నెస్ డే సందర్భంగా అంతర్జాతీయ మోసాలు, సైబర్ నేరాలపై అవగాహన పెంచేందుకు రూపొందించిన ప్రత్యేక వీడియోలను విడుదల చేశారు. అంశాల వారీగా ఈ వీడియోలను సామాజిక మాధ్యమాలతోపాటు ప్రసార మాధ్యమాల్లో విరివిగా ప్రచారం చేస్తామన్నారు. అంతేకాకుండా కమిషనరేట్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో, కాలనీల్లో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్ట్‌టైం జాబ్, సిమ్ కార్డు, బ్యాంక్ ఖాతాలు, నకిలీ యాప్‌లు, క్రిప్టో కరెన్సీ, హనీ ట్రాపింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్, మార్ఫింగ్ వీడియోలు, డిజిటల్ అరెస్ట్, జాబ్ లోన్ ఫ్రాడ్స్ వంటి సైబర్ నేరాలపై అవగాహన పెంచే వీడియోలను ఐటీ సెల్ రూపొందించిందన్నారు. సైబర్ నేరాల బారినపడ్డవారు భయపడకుండా వెంటనే సైబర్‌క్రైం ఠాణాలను గానీ, 1930 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీలు అరవింద్‌బాబు, నాగలక్ష్మి, అడిషన్ డీసీపీ శివకుమార్, ఐటీసెల్ ఏసీపీ నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థికి బాసట

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించి ముందుకొచ్చిన ఉపాధ్యాయురాలు

మన్సూరాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): 'అనాథ విద్యార్థి చదువుకు ఆర్థికసాయం అందించండి' అనే శీర్షికతో ఫిబ్రవరి 24న ప్రచురితమైన కథనానికి చదువుల తల్లే స్పందించి తనవంతుగా ఆర్థిక సాయం అందించింది. వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా హిందూపురం మండలం ముద్దిరెడ్డిపల్లికి చెందిన షేక్షావలి తండ్రిని కోల్పోయి పేదరికంతో ఆర్కేపురం డివిజన్ చిత్రలేఅవుట్ కాలనీలో గల అనాథ విద్యార్థి వసతి గృహంలో ఉంటూ ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ జూనియర్ కళాశాలలో ఉచితంగా అడ్మిషన్ తీసుకుని ఇంటర్మీడియట్‌లో 85శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందాడు. అనంతరం ఫిజియోథెరపీ కోర్సులో చేరేందుకు డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సిలింగ్‌లో పాల్గొనగా ఏపీ రాష్ట్రం నెల్లూరు జిల్లాలోని నారాయణ ఫిజియోథెరపీ కళాశాలలో సీటు వచ్చింది. నాలుగున్నర ఏళ్ల ఈ కోర్సుకు రూ.1.08లక్షలు, వసతి గృహానికి రూ.2.98లక్షల చొప్పున మొత్తం రూ.4.06లక్షలు అవసరమవుతాయన్నారు. కాగా రూ.27వేలు చెల్లించి సీటు రిజర్వు చేసుకోవాల్సి ఉంటుందని, దాతలు ముందుకువచ్చి షేక్షావలికి ఆర్థిక సాయం అందించి అతడి ఉన్నత విద్యకు సహకరించాలని మార్గం రమేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు 'ఆంధ్రజ్యోతి' కథనం ద్వారా విషయం తెలుసుకున్న సనత్‌నగర్‌కు చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు వి.సునీత స్పందించింది. సీటును రిజర్వు చేసుకునేందుకు తనవంతుగా రూ.27వేల ఆర్థిక సాయాన్ని షేక్షావలికి బుధవారం అందించడంతో పాటు నాలుగేళ్ల కళాశాల ఫీజు రూ.1,08,000లను తానే భరిస్తానని హామీ ఇచ్చింది. దీంతో విద్యార్థి షేక్షావలి, మారం రాజేష్‌లు ఆర్థికసాయం అందించిన సునీతతో పాటు తన కథనంతో దాతల్లో చలనం కల్పించిన ఆంధ్రజ్యోతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



అనాథ విద్యార్థి షేక్షావలికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న చదువుల తల్లి సనత్‌నగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు వి.సునీత

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి సూచించారు. న్యాయసేవాధికార సంస్థలో బుధవారం ఆమె మాట్లాడుతూ జాతీయ న్యాయసేవాధికార సంస్థ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మార్చి 8న రంగారెడ్డి జిల్లాలోని అన్ని కోర్టులలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇదివరకు కోర్టు ముందుకు రాని కేసులు, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు కానీ లోక్‌అదాలత్ వేదికగా పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. లోక్‌అదాలత్‌లో కేసు దాఖలు చేసినప్పుడు కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసు లోక్‌అదాలత్‌కు పంపబడి ఆ తర్వాత పరిష్కరించబడినట్లయితే వాస్తవానికి కోర్టులో చెల్లించిన కోర్టు రుసుము కూడా పార్టీలకు తిరిగి చెల్లించబడుతుందన్నారు. లోక్‌అదాలత్‌లో కేసు పరిష్కరించుకుంటే ఇరువర్గాలు గెలిచినట్లేనన్నారు. లోక్‌అదాలత్ ద్వారా సమయం, డబ్బు వృథా కాకుండా ఉంటుందన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, డబ్బు రికవరీకి సంబంధించిన కేసులు, మోటార్ వెహికిల్ యాక్సిడెంట్ కేసులు, చిట్‌ఫండ్ కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు సులభంగా పరిష్కరించుకోవచ్చని ఆమె వివరించారు. జాతీయ లోక్‌అదాలత్‌ను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని ఆమె కోరారు.

వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చంపాపేట జంక్షన్

చంపాపేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వాహనదారులు, బాటసారులకు ఇబ్బందులు లేకుండా చంపాపేట జంక్షన్ అభివృద్ధి చేయనున్నట్లు జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. బుధవారం కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, ఎల్బీనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, ఆయా శాఖల అధికారులతో కలిసి జడ్సీ చంపాపేట చౌరస్తాలో వాహనదారులకు ఇబ్బందిగా ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వాహనదారులకు ఇబ్బందిగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని, విగ్రహాలను అనువైన స్థలంలో ఏర్పాటు చేయాలని సూచించారు. జడ్సీ మాట్లాడుతూ చంపాపేట జంక్షన్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా కార్పొరేటర్, స్థానికుల సూచనల మేరకు అభివృద్ధి చేయనున్నట్లు అన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ కార్తీక్, ట్రాఫిక్ సీఐ నర్సింగ్‌రావు, ఏఎంహెచ్ఓ నాగేష్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ప్రతాప్, ట్రాన్స్‌కో ఏఈ కె.శ్రీనివాస్, జీహెచ్ఎంసీ ఏఈ సురేష్, స్థానికులు బైగళ్ల రవి, మంత్రి జగన్, యాదగిరి, నాయకులు పాశం శ్రీశైలం, సిల్వేరు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పరాయి స్త్రీతో వివాహేతర సంబంధం!

● మహిళకు దేహశుద్ధి చేసిన భార్య

● తప్పించుకుపోయిన భర్త..?

● సరూర్‌నగర్ మహిళా పోలీసులకు ఫిర్యాదు

హయత్‌నగర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తన భర్తతో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఓ మహిళను గుర్తించిన భార్య ఆమెకు దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హయత్‌నగర్‌లోని సంగం హోటల్ వెనకాల అపార్టుమెంటులో నివాసం ఉండే శ్వేత, భర్త, తన ఇద్దరు ఆడ పిల్లలతో కలిసి ఉంటుంది. భర్త ప్రశాంత్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తాడు. శ్వేత ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పని చేస్తుంది. 12 సంవత్సరాల క్రితం ప్రశాంత్‌తో శ్వేతకు వివాహం జరిగింది. వారికి ఇద్దరు సంతానం. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానంటూ వారానికి ఒక రోజు ప్రశాంత్ ఇంటికి వచ్చేవాడు. దీంతో అనుమానం కలిగిన శ్వేత ప్రశాంత్ ఫోన్‌ను తీసుకుని లాక్ తీసి చూడగా ప్రశాంత్ రాసలీలు బయటపడ్డాయి. ప్రశాంత్ లక్ష్మారెడ్డి పాలెంలోని కాంకోర్డ్ షైన్ పాఠశాలలో ప్రైవేటు టీచర్‌గా పని చేస్తున్న వాణితో మూడు సంవత్సరాలుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా ప్రశాంత్ రోజు ఎక్కడికి వెళ్తున్నాడో శ్వేత పరిశీలించింది. వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న భర్తను ఎలాగైనా రెడ్ హ్యాండ్‌గా పట్టుకోవాలని ప్రయత్నించింది. ప్రశాంత్ శనివారం వాణి ఇంట్లో ఉన్నట్లు తెలుసుకుని శ్వేత బంధువులు, ఇద్దరు పిల్లలతో కలిసి వాణి ఇంటికి వెళ్లింది. ఈ విషయాన్ని పసిగట్టిన ప్రశాంత్ గోడదూకి కారులో పారిపోయాడు. అప్పటికే ఆవేశంతో ఉన్న శ్వేత వాణి జుట్టు పట్టుకుని ఇంట్లో నుంచి ఈడ్చుకుని వచ్చి దేహశుద్ధి చేసింది. తన తండ్రి చనిపోవడంతో వచ్చిన రూ. 30 లక్షలు కూడా రియల్ వ్యాపారం పేరుతో ప్రశాంత్ తీసుకుని వాణికి ఇచ్చినట్లు శ్వేత ఆరోపిస్తుంది. డబ్బుల విషయం అడిగితే ప్రశాంత్ తనను రోజు వేధిస్తూ తీవ్రంగా కొట్టేవాడని శ్వేత తెలిపింది. మూడు సంవత్సరాలుగా వీరి ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతున్నట్లు కొన్ని రోజుల క్రితమే తనకు తెలిసిందని శ్వేత తెలిపారు. శనివారమే అరెస్టు చేసి కేసు బుక్ చేయమంటే హయత్‌నగర్ పోలీసులు చేయలేదని తెలిపింది. ఉదయం చేస్తామని చెప్పారని శ్వేత తెలిపారు. ఉదయం తన భర్త ప్రశాంత్ గుట్టుచప్పుడుగాకుండా వచ్చి వాణిని తీసుకుని పారిపోయాడని తెలిపింది. చివరకు పోలీసులు మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయమంటే సరూర్‌నగర్ మహిళా పీఎస్‌లో ఫిర్యాదు చేశామని వారు ఎకనాలెడ్జ్ ఇచ్చారని తెలిపారు. తనకు ప్రభుత్వం అండగా ఉండి న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో తన ఇద్దరు ఆడ పిల్లలు నేను చచ్చిపోతామని రోదిస్తు తెలిపారు. తన పరిస్థితి ఏమిటో చెప్పాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి

మన్సూరాబాద్ : రోడ్డు దాటుతున్న గుర్తుతెలియని మహిళను కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన నాగోల్ ఠాణా పరిధిలో బుధవారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ పి.శివనాగప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఉదయం సుమారు 6.30గంటల ప్రాంతంలో గుర్తుతెలియని మహిళ(సుమారు 45) రోడ్డు దాటుతుండగా ఉప్పల్ నుంచి ఎల్బీనగర్ వైపునకు వెళ్తున్న కారు(టీఎస్ 11ఈక్యూ 9166) ఢీకొట్టింది. ఈ ఘటనలో సదరు మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా ఆమెకు సంబంధించిన ఎలాంటి వివరాలు లభించలేదు. మృతురాలు పింక్ కలర్ జాకెట్, గ్రీన్ కలర్ బార్డర్ కలిగిన తెల్లని చీర ధరించిందని, మృతురాలిని గుర్తించిన వారు వెంటనే నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

జిల్లెలగూడ 'వెంకన్న' గుడిలో గోశాల రగడ

● ఆలయ కమిటీకి అప్పగించాలని ఓ వర్గం వాదన

● గోశాలను ఎత్తేసే కుట్ర అంటూ ఇంకో వర్గం ధ్వజం

● పరస్పరం వాగ్వాదం.. పోలీసుల రంగ ప్రవేశం

● ఎట్టకేలకు ఆలయ కమిటీకి అప్పగిస్తూ ఒప్పందం

సరూర్‌నగర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో గల పురాతన శ్రీమత్స్యావతార వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కొన్నాళ్ల క్రితం ఏర్పాటైన గోశాల వ్యవహారం ఇరువర్గాల మధ్య వాగ్వాదానికి కారణమయింది. గోశాల నిర్వాహకుడు ఆవులను అడ్డం పెట్టుకుని ఆలయంలో వ్యాపారం చేస్తున్నాడని, ఆలయ కమిటీని ధిక్కరించే స్థాయికి చేరుకున్నాడని స్థానికులు కొందరు ఆరోపించారు. ఈ దృష్ట్యా గోశాలను ఆలయ కమిటీకి అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. మరోపక్క ఆలయంలోని గోశాలను ఎత్తేసే కుట్ర జరుగుతున్నదని, దీనిని అడ్డుకుని తీరుతామంటూ మరి కొందరు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గోశాలను తరలిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని వారు హెచ్చరించారు.

ఇరువర్గాల మధ్య వాగ్వాదం..

గోశాల అంశంపై చర్చించే నిమిత్తం బుధవారం ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ రాజా సంజయ్‌గోపాల్ సైంచర్ ఆధ్వర్యంలో ఆలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జిల్లెలగూడ గ్రామానికి చెందిన రెండు వర్గాల నేతలు, గతంలో ఆలయ కమిటీ ప్రతినిధులుగా పని చేసిన నాయకులు, మీర్‌పేట్ కార్పొరేషన్ మాజీ ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ క్రమంలో గోశాలను ఆలయ కమిటీకి అప్పగించాలని ఓ వర్గం.. కుదరదని మరో వర్గం వాదించుకోవడంతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. మూడు గోవులను పెట్టి గోసేవ చేసుకుంటానంటూ ఆలయ కమిటీతో ఒప్పందం చేసుకున్న గోపాలకృష్ణ అనే వ్యక్తి ప్రస్తుతం 20కి పైగా ఆవులను పెంచుతూ, వాటి ఉత్పత్తులతో వ్యాపారం చేసుకుంటున్నాడని, దాతల నుంచి విరాళాల పేరుతో పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసుకుంటున్నాడని కొందరు ఆరోపించారు. అలా సంపాదించిన సొమ్ములో కొంత మొత్తాన్ని ఆలయ అభివృద్ధికి ఇస్తున్నాడని ఇంకొందరు వాదించారు. దాంతో ఇరువర్గాలు మాటామాటా అనుకోవడంతో అక్కడ గందరగోళం నెలకొంది.

పోలీసుల జోక్యంతో సమసిన వివాదం

ఆలయంలో గోశాల అంశంపై వివాదం జరుగుతున్నట్టు సమాచారం అందుకున్న మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ కీసర నాగరాజు, ఎస్ఐ రాజశేఖర్‌గౌడ్ అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వారి ఎదుట కూడా రెండు వర్గాలు వాగ్వాదానికి దిగడంతో ఇన్‌స్పెక్టర్ నాగరాజు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సున్నితమైన అంశాన్ని రాజకీయం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని, అనవసరంగా వివాదం సృష్టిస్తే అందరి మీదా కేసులు పెట్టాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. దాంతో ఇరువర్గాల నేతలు శాంతించారు.



గోశాలను ఆలయ కమిటీకి అప్పగిస్తూ చైర్మన్ సంజయ్‌గోపాల్ సైంచర్‌కు ఒప్పంద పత్రం అందజేస్తున్న గోశాల నిర్వాహకుడు గోపాలకృష్ణ

ఆలయ కమిటీకి అప్పగిస్తూ ఒప్పందం..

దాదాపు రెండు గంటల పాటు సాగిన సుదీర్ఘ చర్చలు, వాదోపవాదాల అనంతరం గోశాలను ప్రైవేటు వ్యక్తి నుంచి ఆలయ కమిటీకి అప్పగించాలని నిర్ణయించారు. ఇకపై గోశాల నిర్వహణ బాధ్యత మొత్తం ఆలయ కమిటీదేనని, ఇతరుల ప్రమేయం ఉండబోదని తీర్మానించుకున్నారు. ఈ మేరకు వ్యవస్థాపక చైర్మన్ రాజా సంజయ్‌గోపాల్ సైంచర్, ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్ఐ రాజశేఖర్‌గౌడ్, ఇరువర్గాలకు చెందిన గ్రామ పెద్దల సమక్షంలో ఒప్పందం రాసుకుని సంతకాలు పెట్టారు. గోశాలను ఆలయ కమిటీకి అప్పగిస్తున్నట్టు పేర్కొంటూ ఇన్నాళ్లూ గోశాలను నిర్వహించిన గోపాలకృష్ణ సదరు పత్రాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఇదే విషయాన్ని ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆలయ ఈవో శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్‌లో తెలియజేయగా, ఆయన సైతం దానికి అంగీకరించారు. త్వరలోనే ఆలయ కమిటీ తరఫున షెడ్డు నిర్మించి గోవులను అందులోకి తరలిస్తామని, గోశాలను తమ కమిటీయే చూసుకుంటుందని ఈ సందర్భంగా వ్యవస్థాపక చైర్మన్ సంజయ్‌గోపాల్ సైంచర్ తెలిపారు.